క్లుప్తంగా

కార్మిక నేత రాముకు ఎమ్మెల్సీ తోట నివాళులు



రాము చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు, తదితరులు

అమలాపురం టౌన్: అమలాపురానికి చెందిన రాష్ట్ర కొబ్బరి కార్మికుల సంఘం అధ్యక్షుడు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గళ్లా రాము మృతి పట్ల ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సంతాపం తెలిపారు. పట్టణంలోని దివంగత రాము ఇంటికి గురువారం వెళ్లి ఆయన కుటుంబీకులను పరామర్శించారు. రాము చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు తోట రాము, ర్యాలీ బుజ్జి తదితరులు రాము కుటుంబీకులను పరామర్శించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ముమ్మిడివరం: ముమ్మిడివరం 33/11కేవీ సబ్ స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు నిమిత్తం శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మండలంలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపు చేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎం.రవికుమార్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

సాంఘిక సంక్షేమాధికారుల కార్యవర్గం ఎన్నిక



కోనసీమ జిల్లా సాంఘిక సంక్షేమ అధికారుల నూతన కార్యవర్గం

అమలాపురం రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహ అధికారుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కమిటీ సభ్యుడు సీహెచ్ చిట్టిబాబు అధ్యక్షతన గురువారం అమలాపురంలో నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. గౌరవ అధ్యక్షుడిగా భగవాన్, అధ్యక్షుడిగా ప్రవీణ్ కుమార్, సెక్రటరీగా హేమలత, ట్రెజరర్‌గా బీఎంవీ సత్యనారాయణ ఎన్నికయ్యారు. వీరితో పాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని సాంఘిక సంక్షేమశాఖ జిల్లా అధికారిణి జ్యోతిలక్ష్మి, ఏఎస్‌డబ్ల్యూఓ సత్యనారాయణలు అభినందించారు.

అయ్యప్ప మాలధారులకు భిక్ష ఏర్పాటు



యానాం దత్త మణికంఠ మందిరంలో స్వాములకు భోజనం వడ్డిస్తున్న మల్లాడి

యానాం: స్థానిక ఫెర్రీ రోడ్‌లో గల దత్త మణికంఠ మందిరంలో గురువారం మధ్యాహ్నం వందలాది మంది అయ్యప్ప మాలధారులకు కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి మల్లాడి సత్తిబాబు భిక్ష ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఏడాది అయ్యప్ప భక్తులు, భవానీలకు భిక్ష ఏర్పాటు చేసి అన్నసమారాధన చేయటం ఆనవాయితీగా వస్తుంది. మల్లాడి స్వయంగా స్వాములకు భిక్ష వడ్డించి పండ్లను అందజేశారు.

జవాన్ కుటుంబానికి ఆర్థిక సాయం



లోవరాజు కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న జవాన్

అమలాపురం రూరల్: పేరూరు చింతపల్లి వారి పాలెం గ్రామానికి చెందిన లోవరాజు అస్సాంలో ఐటీబీపీ జవాన్‌గా పని చేస్తున్నారు. గత నెలలో రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందారు. విషయం తెలుసుకున్న సహచర తెలుగు జవాన్లు మృతుడి కుటుంబానికి అండగా నిలిచారు. బాధిత కుటుంబాన్ని గురువారం పరామర్శించి రూ.92 వేల ఆర్థిక సాయం అందించారు. జవాన్‌కు అండగా నిలిచిన తోటి జవాన్లను గ్రామస్తులు, లోవరాజు కుటుంబ సభ్యులు అభినందించారు.

హౌస్ హోల్డ్ సర్వే విజయవంతం

అల్లవరం: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన హౌస్ హోల్డ్ క్యాప్చర్ సర్వేలో రాష్ట్రంలోనే అల్లవరం మండలం ప్రథమ స్థానంలో నిలిచిందని ఎంపీడీఓ కృష్ణమోహన్ గురువారం తెలిపారు. మండలంలో 22,860 కుటుంబాలకు గానూ శతశాతం సర్వే చేయడం జరిగిందన్నారు. క్షేత్ర స్థాయిలో చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించిన సచివాలయ సిబ్బందిని ఎంపీడీఓ అభినందించారు.

బియ్యమో రామచంద్రా..!

- రేషన్ షాపుల మూసివేతతో పంపిణీ కాని ఉచిత బియ్యం
- బహిరంగ మార్కెట్‌లో కొనలేని స్థితిలో పేద వర్గాలు
- సక్రమంగా అమలు కాని ప్రజా పంపిణీ వ్యవస్థ
- నెరవేరని పాలకుల హామీలు



ఏళ్ల తరబడి మూతపడ్డ దరియాలతిప్పలోని రేషన్ దుకాణం

యానాం: ప్రజా పంపిణీ వ్యవస్థ(పీడీఎస్) ద్వారా పేదవర్గాలకు నెలవారీ పంపిణీ చేసే ఉచిత బియ్యం పథకం కొన్నేళ్లుగా అమలు కాకపోవడం విమర్శలకు తావిస్తోంది. నెలల తరబడి ఈ పథకం ద్వారా బియ్యం పంపిణీ నిలిపివేతతో పేద, బడుగు, బలహీన వర్గాల వారు ఇబ్బందులు పడుతున్నారు. పుదుచ్చేరిలో 2016 జూన్‌లో సీఎం నారాయణసామి ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పడింది. అప్పట్లో కొన్ని నెలల పాటు ఉచిత బియ్యం పంపిణీ జరిగిన తర్వాత కాలక్రమంలో రేషన్ షాపులు మూతపడ్డాయి. అనంతరం 2021లో సీఎం రంగసామి నేతృత్వంలో బీజేపీ, ఎన్ఆర్ కాంగ్రెస్, ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చింది. రేషన్‌షాపులు తెరిపిస్తామని అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రజలకు హామీ ఇచ్చింది. అయితే రెండున్నర ఏళ్లు గడిచినా ఇప్పటివరకు రేషన్‌షాపులు తెరుచుకోక పోవడంతో ఉచిత బియ్యం పంపిణీ జరగడం లేదు. ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్‌యోజన పథకం బియ్యం సైతం ఇవ్వడం లేదని అబ్ధిదారులు వాపోతున్నారు. నగదు బదిలీ ద్వారా వచ్చే కొద్దిపాటి సొమ్ముతో బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు బియ్యాన్ని కొనుగోలు చేయలేని దైన్యస్థితిలో పేద, మధ్యతరగతి వర్గాలు సతమతమవుతున్నా పాలకులకు పట్టకపోవడం శోచనీయం.

బియ్యం, తదితర నిత్యావసర వస్తువులు పంపిణీ చేసే సివిల్ సప్లయిస్ శాఖ ఆధ్వర్యంలో నడిచే 21 రేషన్ షాపులను మూసివేశారు. దీంతో దానిలో పనిచేసే డీలర్లు, సిబ్బందితో సహా 40 మంది ఉపాధి కోల్పోయారు. ఇటు పనిలేక, అటు జీతాలు లేక వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. సీఎం రంగసామి, సివిల్ సప్లయిస్ శాఖ మంత్రి సైతం రేషన్ దుకాణాలు తెరిపిస్తామని దాని ద్వారా బియ్యం పంపిణీ చేస్తామని హామీ ఇచ్చి రెండున్నర ఏళ్లు గడుస్తున్నా అది అమలు కావడం లేదు. ఇటీవల పార్లమెంట్ ఎన్నికల ప్రచార సభలో పలువురు రేషన్ షాపులు తెరిపించాలని ఆందోళన చేయడంతో తెరిపిస్తామని నామమాత్రపు హామీ ఇచ్చారు. యానాంలో చివరిసారిగా 2016 జూలైలో బియ్యం పంపిణీ చేసారని అప్పటినుంచి ఇప్పటివరకు ఉచిత బియ్యం పంపిణీ జరగలేదని పలువురు లబ్ధిదారులు చెబుతున్నారు.

డీబీటీ పథకంపై అసంతృప్తి

యానాం నియోజవర్గ పరిధిలోని బీపీఎల్, ఏపీఎల్ పరిధిలో సుమారు 16వేలకు పైగా రేషన్ కార్డులు ఉన్నాయి. ఈ రేషన్‌కార్డు దారులకు ప్రతి నెలా బియ్యం పంపిణీ చేయాల్సి ఉంది. బియ్యానికి బదులు నగదు బదిలీ (డీబీటీ) పద్ధతి ద్వారా బ్యాంకుల్లో సొమ్ము జమచేసి చేతులు దులుపుకుంటున్నారని పలువురు విమర్శిస్తున్నారు. ఆ సొమ్ముతో బహిరంగ మార్కెట్‌లో బియ్యం కొనలేక నానా అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగదు ఆపేసి బియ్యం పంపిణీ చేయాలని కోరుతున్నారు.

> **నగదుకు బదులు బియ్యం ఇవ్వాలి**
>
> 
>
> బీజేపీ, ఎన్ఆర్ కాంగ్రెస్, ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రేషన్ షాపులు తెరిపిస్తామని హామీ ఇచ్చారు. వీటి ద్వారా ఉచిత బియ్యంతో పాటు నిత్యావసరాలు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. ఇంతరవకు హామీని నిలబెట్టుకోలేదు. పేద ప్రజలు బహిరంగ మార్కెట్‌లో బియ్యం కొనలేని దైన్యస్థితిలో ఉన్నారు. నగదు మానేసి ఉచిత బియ్యం ఇవ్వాలి.
>
> సబ్బతి శ్రీనివాసరావు,
> గ్రామపెద్ద, దరియాలతిప్ప.

ఆరేళ్లుగా నిలిపివేత

డిశెంబర్ నెల నుంచి ఉచిత బియ్యం పంపిణీ చేస్తామని దీనితో పాటు నిత్యావసరాలు సైతం అందజేస్తామని ఇటీవల సీఎం రంగసామి వెల్లడించారు. దీనికి సంబంధించిన ఫైలు ఎల్జీ కె కైలాష్‌నాథన్ వద్ద ఉందని అది ఆమోదం పొందితే అమలు చేస్తామని చెబుతున్నారు. దివ్యాంగులకు ఏడాది నుంచి ఇవ్వాల్సిన బియ్యం సైతం ఇవ్వడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చివరిసారిగా 2018 ఆగష్టు 15న 25 కేజీల చొప్పున సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా ఉచిత బియ్యం ఇచ్చారని అప్పటినుంచి ఆరేళ్లు గడుస్తున్నా ఇంతరవకు మళ్లీ ఇవ్వలేదని దివ్యాంగులు వాపోయారు. యానాంలో సుమారు 1000 మంది వరకు వికలాంగులు దివ్యాంగులు ఉన్నారు.

విద్యకు తొలిమెట్టు అంగన్వాడీ కేంద్రం



నారాయణపేట అంగన్వాడీ కేంద్రంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సిబ్బంది

అమలాపురం రూరల్: విద్యకు తొలి మెట్టు అంగన్వాడీ కేంద్రమని అమలాపురం సీడీపీవో విజయశ్రీ అన్నారు. ఐసీడీఎస్ అమలాపురం ప్రాజెక్టు పరిధిలోని పేరూరు పరిధిలో అంగన్వాడీ కేంద్రాల్లో జరుగుతున్న ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్స్‌లో భాగంగా అంగన్వాడీ కేంద్రాలలో జరుగుతున్న కార్యక్రమాలను బుధవారం ఆమె పరిశీలించారు. సూపర్‌వైజర్ అన్నపూర్ణ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. బండారులంక, నారాయణపేట అంగన్వాడీ కేంద్రాల్లో కార్యక్రమాలు నిర్వహించారు. సర్పంచ్ పెనుమాల సునీత, ఎంపీటీసీ సభ్యురాలు గుత్తుల జానకీలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.మహేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గుంటూరు సభను విజయవంతం చేయాలి



ఉప్పలగుప్తంలో చలో గుంటూరు వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జేఏసీ నాయకులు

ఉప్పలగుప్తం: ఈ నెల 15న గుంటూరు జిల్లా నల్లపాడులో జరిగే మాలల మహాగర్జన సభకు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని మాల మహానాడు మండల జేఏసీ పిలుపు నిచ్చింది. మాల మహానాడు మండల కన్వీనర్ కొంకి వెంకట బాబ్జి అధ్యక్షతన మండలంలోని ఉప్పలగుప్తం గ్రామంలో చలో గుంటూరు వాల్‌పోస్టర్లను జేఏసీ నాయకులు గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పెయ్యల పరశురాముడు, జల్లి శ్రీనివాస్, నాతి శ్రీనివాస్, కుంచే బాబులు, బడుగు శ్రీను, దోనిపాటి అశోకచక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు వీరేశ్వరస్వామి హుండీ లెక్కింపు

ఐ.పోలవరం: మురమళ్ల శ్రీ వీరేశ్వరస్వామి వారి దేవస్థానంలో శుక్రవారం హుండీ లెక్కింపు చేపడుతున్నట్లు ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి మాచిరాజు లక్ష్మీ నారాయణ గురువారం తెలిపారు. దేవదాయశాఖ తనిఖీ అధికారి సమక్షంలో కార్యక్రమం జరుగుతుందన్నారు. గ్రామస్తులు, భక్తులు పాల్గొనాలని సూచించారు.

నాయకా.. ఇదేమి న్యాయం..!

- టీడీపీ నాయకుడి ఇంటికి పైపులైను కోసం రహదారి ధ్వంసం
- బాలావారిపేటలో చోటు చేసుకున్న ఘటనపై గ్రామస్తుల ఆగ్రహం



బాలావారిపేటలో సీసీ రహదారిని ధ్వంసం చేసి తాగునీటి పైపులైను వేసిన దృశ్యం

తాళ్లరేవు: ఇంజరం పంచాయతీలో జరుగుతున్న ఇంటింటికీ తాగునీటి పైపులైను కార్యక్రమంలో భాగంగా స్థానిక బాలావారిపేటలో సీసీ రహదారిని ధ్వంసం చేయడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం బాధితులు బాలా లోవరాజు, బాలా ఈశ్వరి, బాలా రామకృష్ణ, కట్టా నాగేశ్వరరావు, కట్టా లోవరాజు, భవాని, రమణ, సూరిబాబు తదితరులు తమగోడు వెళ్లబోసుకున్నారు. తాగునీటి పైపులైన్ నిర్మాణానికి సంబంధించి గ్రామమంతా రహదారి చెంతన తవ్వి పైపులైన్ వేయగా, బాలావారిపేట గ్రామంలో మాత్రం స్థానిక టీడీపీ నాయకుడు ఇంటికి ఎటువంటి నష్టం కలుగకుండా సీసీ రహదారినే ధ్వంసం చేసి పైపులైన్ నిర్మించారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే రహదారి ఇరుకుగా ఉండడంతో తమ పేటలోకి ట్రాక్టర్లు గానీ, మరే ఇతర వాహనాలు గానీ రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. దీని గురించి ప్రశ్నించినందుకు ఊరి చివరి వరకు వేయాల్సిన తాగునీటి పైపులైన్‌ను మధ్యలోనే అర్ధాంతరంగా ఆపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి ఎం.ప్రసాద్‌ను వివరణ కోరగా పలు కారణాలతో సంబంధిత కాంట్రాక్టరు వేరే చోట పని ప్రారంభించడం వల్ల ఈ పనులను తాత్కాలికంగా నిలిపివేసినట్లు చెప్పారు. రెండు, మూడు రోజుల్లో తిరిగి పని ప్రారంభించి పూర్తిచేయడం జరుగుతుందన్నారు. ధ్వంసం చేసిన రహదారిని తిరిగి యధావిధిగా వేయాల్సిన బాధ్యత కాంట్రాక్టరుదేనని అన్నారు.

నేటి నుంచి షష్ఠి మహోత్సవాలు

సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం, తీర్థానికి ఏర్పాట్లు



అమలాపురం శ్రీ సుబ్రహ్మణ్యస్వామి దేవస్థానంలో స్వామి మూల విరాట్టు

అమలాపురం టౌన్: అమలాపురం కాలేజీ రోడ్డులో గల వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి దేవస్థానం వద్ద జిల్లా దేవదాయ, ధర్మాదాయ శాఖ ఈ నెల 6 నుంచి 11వ తేదీ వరకూ షష్ఠి మహోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేసింది. శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న ఉత్సవాలు బుధవారం పుష్పయాగంతో ముగుస్తాయని దేవస్థానం ఈవో ఆర్.శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం రాత్రి స్వామి వారికి ధూమసేవ, ధ్వజారోహణం, ఆ తర్వాత స్వామి రథోత్సవం నిర్వహిస్తారు. అదే రోజు రాత్రి 1.45 గంటలకు దేవస్థానానికి ఎదురుగా గల యేడిద సత్యనారాయణ కళా మందిరంలో స్వామివారి కల్యాణం నిర్వహించనున్నట్లు ఈవో శ్రీనివాస్ తెలిపారు. కల్యాణం అనంతరం రాత్రి 2.15 గంటలకు (తెల్లవారితే శనివారం) భక్తులకు స్వామి దర్శనాన్ని ఏర్పాటు చేస్తారు. శనివారం రోజంతా దేవస్థానం వద్ద 216 జాతీయ రహదారిపై షష్ఠి తీర్థం జరుగుతుంది. సాయంత్రం 4.15 గంటలకు స్వామి పల్లకీ సేవ నిర్వహిస్తారు. 8వ తేదీ ఉదయం స్వామివారి మయూరి (నెమలి) వాహన ఊరేగింపు, అదే రోజు రాత్రి సదస్యం, మహదాశీర్వాదం జరుగుతుంది. 9వ తేదీ ఉదయం 10.15 గంటలకు సర్పవాహనంపై గ్రామోత్సవం నిర్వహిస్తారు.11వ తేదీ రాత్రి 7.30 గంటలకు పుష్పయాగం నిర్వహిస్తారు. చివరిగా 15వ తేదీన స్వామివారి దేవస్థానం వద్ద ప్రభల తీర్థం జరుగుతుందని ఈవో శ్రీనివాస్ తెలిపారు. షష్ఠి తీర్థం రోజున అమలాపురం పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, బందోబస్తుకు ఏర్పాట్లు చేసినట్లు పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు.

స్నేహమేరా శాశ్వతం..!

అనారోగ్యం పాలైన బాల్య మిత్రుడికి స్నేహితుల ఆర్థిక సాయం



చిన్ననాటి స్నేహితుడికి రూ.50 వేలు ఆర్థిక సాయం అందజేస్తున్న డైమండ్ గ్రూపు ప్రతినిధులు

తాళ్లరేవు: చిన్నప్పుడు తమతో కలిసి చదువుకున్న స్నేహితుడికి ఆరోగ్యం బాలేదన్న విషయం తెలుసుకున్న స్నేహితులు స్వయంగా వెళ్లి పరామర్శించడంతో పాటు రూ.50 వేలు ఆర్థిక సాయం అందజేశారు. 1987–88వ సంవత్సరంలో తాళ్లరేవు నామన వెంకాయమ్మ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో కలిసి చదువుకున్న విద్యార్థులు డైమండ్ గ్రూప్‌గా ఏర్పడి పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. దీనిలో భాగంగా తమ తోటి స్నేహితుడు పులపకూర సుధాకర్ అనారోగ్యంతో బాధ పడుతున్నాడని తెలుసుకున్న వెంటనే గ్రూపు సభ్యులు కాకినాడ ఇంద్రపాలెంలోని సుధాకర్ ఇంటికి గురువారం వెళ్లారు. అతని ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీసి ఆత్మీయంగా పలుకరించి ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో డైమండ్ గ్రూపు సభ్యులు బిళ్లకుర్తి శ్రీనివాసరెడ్డి, గంజా సూరిబాబు, పొన్నాడ పేరయ్యరాజు, ఉంగరాల కృష్ణ, యాళ్ల వెంకటేశ్వరరావు, గంగుల భాస్కరరావు, బాలయోగి తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

ముమ్మిడివరం: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా చేపట్టనున్న రెవెన్యూ సదస్సుల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ ఎం.సుబ్బలక్ష్మి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 6 నుంచి 31 వరకు జరిగే రెవెన్యూ సదస్సుల్లో భాగంగా మండలంలో గ్రామ సచివాలయాలు, నగర పంచాయతీలు, వార్డు సచివాలయాల్లో ఈ సదస్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు. సదస్సుల్లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వాటి పరిష్కారానికి కృషి చేయటం జరుగుతుందన్నారు. తహసీల్దార్, ఆర్ఐ, సర్వేయర్, వీఆర్వో, విలేజ్ సర్వేయర్, దేవదాయ శాఖ అధికారులు, వక్ఫ్ బోర్డు అధికారులు పాల్గొంటారన్నారు.

వెంకన్న ఉత్సవ కమిటీ ఏర్పాటు

అమలాపురం టౌన్: కోనసీమ పెళ్లిళ్ల వెంకన్నగా పేరు గాంచిన స్థానిక వేంటేశ్వర స్వామి దేవస్థానానికి ఏడుగురి సభ్యులతో కూడిన ఉత్సవ కమిటీని తాత్కాలికంగా నియమించారు. ఉత్సవ కమిటీ సభ్యులతో దేవస్థానం ఈవో యర్రా వెంకటేశ్వరరావు గురువారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. వచ్చే ఏడాది జనవరి 10న దేవస్థానంలో జరగనున్న ముక్కోటి ఏకాదశి ఉత్సవాలను నిర్వహించే అంశంపై చర్చించారు. స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు సూచనలతో కమిటీని ఏర్పాటు చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతం



ఉప్పలగుప్తంలో పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో మాధవి



పోలింగ్ కేంద్రం వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న డీఎస్పీ ప్రసాద్, పట్టణ సీఐ వీరబాబు తదితరులు



అల్లవరం పోలింగ్ కేంద్రం నుంచి బాక్సులు తరలిస్తున్న సిబ్బంది

- ఓటు వినియోగించుకున్న ఉపాధ్యాయులు
- పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

అమలాపురం టౌన్: జిల్లా కేంద్రం అమలాపురం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో గల సర్వశిక్ష అభియాన్ భవనంలో ఏర్పాటైన పోలింగ్ కేంద్రంలో ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. జిల్లా మొత్తం మీద అమలాపురం పోలింగ్ కేంద్రంలో అత్యధికంగా 606 ఉపాధ్యాయ ఓట్లు ఉన్న సంగతి తెలసిందే. 606 ఓట్లకు గాను 574 ఓట్లు పోలయ్యాయి. ఉపాధ్యాయ నియోజకవర్గానికి పోటీ చేసిన పట్టణానికి చెందిన స్వతంత్ర అభ్యర్థి, కోనసీమ జేఏసీ కన్వీనర్ బండారు రామమోహనరావు ఈ పోలింగ్ కేంద్రంలో ఓటుహక్కు వినియోగించుకున్నారు. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు విజయవాడ నుంచి అమలాపురం వచ్చి ఇక్కడి ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. పోలింగ్ కేంద్రం వెలుపుల అమలాపురానికి చెందిన యూటీఎఫ్ ప్రతినిధులతో ఓటింగ్ సరళిపై చర్చించారు. అమలాపురం పట్టణం, రూరల్ మండల పరిధిలోని ఉపాధ్యాయులు ఈ పోలింగ్ కేంద్రం ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అమలాపురం డీఎస్పీ ప్రసాద్, పట్టణ సీఐ వీరబాబు, ఎస్సైల ఆధ్వర్యంలో పోలింగ్ కేంద్రం వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటైంది. దాదాపు 350 మందికి పైగా ఉపాధ్యాయులు ఉదయం పూటే తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

అల్లవరం: ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు అల్లవరంలో ప్రశాంతంగా జరిగింది. అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఉపాధ్యాయులు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించగా 74 ఓట్లకు గానూ 73 ఓట్లు పోలయ్యాయి. పోలింగ్ సరళిపై తహసీల్దార్ వీవీఎల్ నరసింహారావు పర్యవేక్షించారు. పోలింగ్ అనంతరం బాక్సులకు సీల్ వేసి పోలీసు బందోబస్తు మధ్య అమలాపురం కేంద్రానికి తరలించారు. పోలింగ్ కేంద్రం ఎస్సై హరీష్‌కుమార్ బందోబస్తు నిర్వహించారు.

పోలింగ్ బూత్ పరిశీలన

ఉప్పలగుప్తం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. ఎన్నికలు జరుగుతున్న సమయంలో ఆర్డీవో కె.మాధవీలత బూత్‌ను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. మండల వ్యాప్తంగా 55 మంది ఉపాధ్యాయ ఓటర్లకు గానూ 54 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని పీవో ఎం.ఆనందబాబు తెలిపారు.

ముమ్మిడివరం: తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ముమ్మిడివరం ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో 137 మంది ఓట్లకు గానూ 130 ఓట్లు పోలయ్యాయి. 94.89 శాతం పోలింగ్ నమోదైనట్లు ఏఈఆర్ఓ ఎం.సుబ్బలక్ష్మి తెలిపారు.



తాళ్లరేవులో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కాకినాడ ఎస్పీ విక్రాంత్ పాటిల్

తాళ్లరేవు: మండల కేంద్రం తాళ్లరేవు మండల ప్రజా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో గురువారం నిర్వహించిన ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మండలంలో 94 శాతం మేర పోలింగ్ నమోదైనట్లు తహసీల్దార్ పితాని త్రినాథరావు తెలిపారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 4 గంటలకు ముగిసింది. మండలంలో మొత్తం 83 మంది ఓటర్లు ఉండగా 78 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాన్ని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ పరిశీలించి పోలింగ్ జరుగుతున్న తీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట అదనపు ఎస్సై సత్యనారాయణ ఉన్నారు.